క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: భవ్యాస్ తులసీవనం రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను మారుస్తున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. అరుణ సొసైటీ ఫీడర్, విజయనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జయనగర్, అరుణ సొసైటీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు...

◆ ఎల్లమ్మబండ ఫీడర్, శంషీగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళినగర్, శంషీగూడ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు...

◆ అదే విధంగా పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని సమతానగర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వివేకానందనగర్ నూతన కార్యవర్గం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ అపార్టుమెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.వాసుదేవరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్. వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా బి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.చెన్నారెడ్డి, ట్రెజరర్‌గా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా వెంకటరామయ్య, సభ్యులుగా బి.కామరాజు, వి.అనిల్‌కుమార్, జేవీ స్వామి, ఎస్ఆర్‌కేవీ ప్రసాద్, మల్లేశ్వరరావు, జగన్ మోహన్‌రెడ్డి, నరేంద్రబాబు, కన్నరాజు, పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు.

అగ్రశ్రేణి వర్సిటీగా హెచ్‌సీయూ

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్త యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గ్లోబల్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనలిస్ట్ క్యూఎస్ క్వాక్వెరెల్లి సైమండ్స్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ సోషియాలజీ, ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్, లిటరేచర్‌లో అత్యుత్తమ పనితీరును కనబరిచింది. భారతదేశంలోని వర్సిటీలలో హెచ్‌సీయూ 5వ స్థానంలో ఉంది.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ దేవాలయం వద్ద జరుగుతున్న వాటర్‌వర్క్స్ పనులను మాజీ కార్పొరేటర్ బాబూరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని తాగునీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. వేసవిలో మంచినీటి సమస్య లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాయకులు భాస్కర్, సిబ్బంది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన, పరిశోధనల్లో మార్పులు రావాలి

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మూడు రోజులపాటు సాగే సదస్సు కొనసాగుతోంది. రెండవ రోజైన శుక్రవారం 'ఉన్నత విద్యారంగంలో నాణ్యత, సూచికలు' అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. ముఖ్యంగా ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన, పరిశోధనల్లో కూడా మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది ప్రతినిధులు, 35కు పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు వర్చువల్ మోడ్‌లో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై తమ పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సదస్సులో లండన్, పోలాండ్, ఇండోనేషియా, మలేషియా, జర్మనీ, ఇండియా, థాయిలాండ్‌లకు చెందిన అంతర్జాతీయ ప్రముఖులు కూడా ఆన్‌లైన్‌లో కూడా పాల్గొన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సునంద భట్టాచార్యకు సెర్బ్ పవర్ ఫెలోషిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ సునంద భట్టాచార్యకు 2023 సెర్బ్-పవర్ ఫెలోషిప్ లభించింది. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ సునంద భట్టాచార్య పనిచేస్తున్నారు. ఆమెకు 2023-26 కాలానికి సెర్బ్-పవర్ ఫెలోషిప్ లభించింది.

అరుస్తాయ్.. కరుస్తాయ్

వీధి కుక్కలు.. జనాలకు చూపిస్తున్నాయి చుక్కలు



ఆంజనేయనగర్‌లో రోడ్డుపై వీధి కుక్కలు



హెచ్‌పీ రోడ్డులోని నిర్మాణ భవనం వద్ద సంచరిస్తున్న కుక్కలు



భవానీనగర్‌లోని ఒక షాపు వద్ద ఉన్న కుక్కలు

మూసాపేట: ఇటీవల జరుగుతున్న కుక్కల దాడులతో ప్రజలు వీధి కుక్కలను చూస్తేనే భయపడుతున్నారు. మూసాపేట పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రతి వీధిలో గుంపులుగుంపులుగా ఉండటంతో ఆయా ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలోనే కాకుండా పట్టపగలు కూడా కుక్కలకు భయపడి వీధుల్లోకి వెళ్లలేకపోతున్నారు. చిన్నారులు పాఠశాలకు పంపాలన్నా, బయటకు పంపాలన్నా భయపడుతున్నారు. నగరంలో కుక్క కాటు సంఘటనలు వరుసగా జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా తమ గోడును పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు.

◆ బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ కాలనీలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. గత సంవత్సరం ఎండా కాలంలో ఈ కాలనీలో వరుసగా కొంతమందిని కరిచి గాయపర్చిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఖైత్లాపూర్, సేవాలాల్ నగర్‌లలో కూడా కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి.

◆ అంబేద్కర్ నగర్ వద్ద మూడు నెలల క్రితం ఒకే కుక్క 5 మందిని కరిచింది. అంతేకాకుండా ఒక ఆవును, దూడను గాయపర్చి తన పిల్లలను కూడా చంపుకున్న సంఘటన ఉంది. అయినా కుక్కల బెడద మాత్రం తప్పటం లేదని స్థానికులు తెలుపుతున్నారు.

◆ భరత్‌నగర్ కాలనీలోని హెచ్‌ఐజీ పార్కులో కుక్కలే ఎక్కువ ఉంటాయి. పార్కులో తిష్ఠ వేసి లోపలికి వచ్చే వారిని భయపెడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ హెచ్‌పీ రోడ్డులో నిర్మాణ భవనం వద్ద సుమారు 10 కుక్కలు సంచరిస్తున్నాయి. కార్మికులు పనికి అటువైపు వెళ్లేందుకు కూడా జంకుతున్నారు.

◆ శ్రీశ్రీ నగర్ ఇందిరానగర్‌లో సుమారు 20కి పైగా కుక్కలు ఉంటాయని, ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మళ్లీ తమ ఇంటికి వెళ్లాలన్నా అక్కడి ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంతో మంది కుక్క కాట్లకు ఆస్పత్రుల పాలైన దాఖలాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ జనతానగర్‌లో చిన్న చిన్న వీధుల్లో కూడా ఐదారు కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మూడు సంవత్సరాల క్రితం ఓ చిన్నారిని నాలుగు కుక్కలు చుట్టు ముట్టడంతో ధైర్యంగా వాటిని ఎదుర్కొని ఇంటికి చేరుకున్నాడు. అప్పటిలో ఆ సంఘటన సంచలనం అయ్యింది. అప్పటి నుంచి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని, కుక్కలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ అధికారులకు విన్నవించినా వాటిపై చర్యలు తీసుకోవటం లేదని వాపోతున్నారు. రానున్న ఎండాకాలంలో కుక్కలు మరింత పేట్రేగిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఒకే కుక్క ఎంతో మందని కరిచింది..



ఆంజనేయనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఒకే కుక్క వరుసగా కొంత మందిని గాయపర్చిన సంఘటనలు కూడా ఉన్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదు. ముఖ్యంగా పార్కుల వద్ద, కూడళ్ల వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

– రాము, ఆంజనేయనగర్

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని... అభ్యర్థులకు సత్వర న్యాయం చేయాలని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధరవరం కాంతారావు డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీకి సంబంధించిన వ్యవహారం ఇప్పటికీ కొలిక్కి రాకపోవడం ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పనితనానికి నిదర్శనం అన్నారు. లీకేజీ వ్యవహారంలో అసలైన నిందితులను కాకుండా దానిపై ప్రశ్నించిన బండి సంజయ్‌కుమార్‌కు సిట్ నోటీసులు జారీ చేయటం సరికాదన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో బాధ్యులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క అభ్యర్థికి ప్రభుత్వం లక్ష రూపాయల నష్టపరిహారం ఖచ్చితంగా అందజేయాలన్నారు.

◆ **నేడు మా నౌకరీలు మాకు కావాలె**

అదే విధంగా నిరుద్యోగుల పక్షాల 'మా నౌకరీలు మా కావాలె' నినాదంతో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ధర్నాచౌక్ వద్ద శనివారం నిరుద్యోగ మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాకు తెలంగాణ నిరుద్యోగులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరిగానే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కాంతారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్‌రావు, రవికుమార్‌గౌడ్, నాగరాజు, వినోద్‌గౌడ్, మల్లేష్, సంతోష్, రవి, రాములు, బచల్ వినోద్, విక్కి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాధవరం కాంతరావు, బీజేపీ నాయకులు

కార్యకర్తలు ప్రజలకు పార్టీకి వారధిలా ఉండాలి



ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలకు పార్టీకి వారధిలా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి సైనికులలాగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు పెద్ద భాస్కర్‌రావు, ఏరియా కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ, బస్తీ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశపతి ఎమ్మెల్సీ కావడం భాషా పండితులకు గర్వకారణం



ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు

కూకట్‌పల్లి: ఇటీవల ఎమ్మెల్సీ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్‌ను శుక్రవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పూలమొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. తెలుగు భాషా పండితుడిగా ఉన్న శ్రీనివాస్ ఎమ్మెల్సీ కావడం రాష్ట్రంలోని భాషా పండితులకు గర్వకారణమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి తిరుమల కాంతికృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, కోశాధికారి వీఎస్ఎస్ శర్మ అభినందించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా భాషా పండితుల సమస్యలపై సానుకూలంగా వ్యవహరించి సహకరించాలని కోరారు.

భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



కూకట్‌పల్లి: భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదర్‌నగర్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఆటోస్టాండ్ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శంకర్, కార్యదర్శి వి.శివప్రసాద్, సభ్యులు రాజారావు, ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణ త్యాగం చేశాడన్నారు. భగత్‌సింగ్ చిన్న వయసులోనే జలియన్ వాలాబాగ్ ఉదంతం చూసి చలించిపోయాడన్నారు. అతిచిన్న వయసులోనే రాజ్‌గురు, సుఖదేవ్, భగత్‌సింగ్‌లకు బ్రిటిష్ ప్రభుత్వం ఉరిశిక్ష వేసిందన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కృష్ణనాయక్, సత్తయ్య, నాగేశ్వరరావు, వీరయ్య, ఎల్‌డీ ప్రసాద్, మహేష్, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్: జీడిమెట్లలోని శ్రీవేంకటేశ్వర శివ వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి నిర్వహించిన అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఆయన్ని సత్కరించింది. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. స్వామి వార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారావు, రాఘవేంద్రరావు, శ్రవణ్ కుమార్, మహిపాల్‌రెడ్డి, గోపాల్‌చారి, వీరేష్‌గౌడ్, బీజేపీ నాయకులు బాలప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కంకణబద్ధులు కావాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్



టీబీ డే సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పుట్ల శ్రీనివాస్

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్రంలోని 23 జిల్లాల్లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా క్షయవ్యాధి నిర్మూలనలో 2వస్థానంలో ఉందని.. 2025 వరకు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు సిబ్బంది, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కంకణబద్ధులు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం టీబీ డే సందర్భంగా కూకట్‌పల్లిలో జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీబీని గుర్తించడం, చికిత్స అందించడం, ఉచిత పరీక్షలు చేయించటం పూర్తి మందులు వాడే విధంగా చూడాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య ఉద్యోగులదని అన్నారు.

◆ టీబీ పట్ల అవగాహన కల్పించే బాధ్యత స్వచ్ఛంద సంస్థలదన్నారు. జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, టీబీ చాంపియన్స్ పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో టీబీ నిర్మూలనకు విశేష కృషి చేసిన మోహన్‌దాస్, శ్రవణ్‌కుమార్, సరితకు మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులతో టీబీ అంతం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డా. ఆనంద్, డా. నారాయణరావు, డా. రాంకుమార్, జి. వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీబీని నిర్మూలనకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

లోన్‌యాప్ వేధింపులు

చనిపోతున్నానని ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి



త్రిమూర్తులు (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: ఆన్‌లైన్ యాప్ ద్వారా తీసుకున్న మొత్తం తిరిగి చెల్లించినా తనను వేధిస్తున్నారని.. తాను చనిపోతున్నానని వాట్సప్ మెసేజ్ పెట్టిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి రామయ్య నగర్‌లో నివాసం ఉంటున్న త్రిమూర్తులు (39) తన సోదరుడు వినయ్‌తో పాటు స్నేహితులతో కలిసి ఒక రూములో నివాసం ఉంటున్నాడు. త్రిమూర్తులకు మియాపూర్‌లో హోటల్ ఉంది. వినయ్ ఈనెల 22న రూమ్‌కు వచ్చి అన్న త్రిమూర్తులకు ఫోన్ చేయగా ఫ్రెండ్‌ని కలవడానికి వెళ్లానని అతనితో పేర్కొన్నాడు. 23వ తేదీ ఉదయం త్రిమూర్తులు నుంచి మెసేజ్ వచ్చింది. తాను ఆన్‌లైన్‌లో లోన్ తీసుకున్నానని.. తిరిగి చెల్లించినప్పటికీ తనను వేధిస్తున్నారని అందుకే తాను చనిపోవాలని అనుకుంటున్నానని... నువ్వు, అమ్మ జాగ్రత్తగా ఉండండి.. అని పేపర్‌లో రాసి సోదరుడు వినయ్‌కి వాట్సాప్‌కు పంపాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కూకట్‌పల్లి పోలీసులకు తన సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రపంచ నీటి దినోత్సవంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జలమండలి అధికారులు

కూకట్‌పల్లి: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జలమండలి అధికారులతో అవగాహన కరపత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆవిష్కరించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజుకు 520 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణా, గోదావరి నదుల నుంచి నగర ప్రజలకు అందిస్తున్నామన్నారు. సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ల నుంచి పెద్ద పైపులైన్ల ద్వారా జలమండలి నీటిని సరఫరా చేస్తోందని వివరించారు. నీటి నాణ్యత ప్రమాణాలు పాటించడంలో నాణ్యత యాప్‌ను కూడా జలమండలి సిద్ధం చేసిందని తెలిపారు.

ప్రతిరోజు వృథాగా 20 మిలియన్ గ్యాలన్ల తాగునీరు

◆ ఈ విలువైన నీటిని ప్రజలు వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. ఒక అంచనా ప్రకారం నగరంలో రోజుకు 20 మిలియన్ గ్యాలన్ల తాగునీటిని ప్రజలు వృథా చేస్తున్నారని తెలిపారు. నల్లాల ద్వారా వచ్చేనీటిని తాగేందుకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. వృథా చేస్తున్న నీటితో లక్షలాది మందికి అందిచొచ్చని అన్నారు. రేపటి తరానికి తాగునీటి సమస్య రాకుండా చేయాలంటే మనమంతా తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి వృథా తగ్గించే బాధ్యత ప్రతి పౌరుడు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రభాకర్, డీజీఎం వెంకటేశ్వర్లు, రవి, షంషీద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆల్విన్‌కాలనీ: ప్రపంచ నీటి దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం వివేకానందనగర్ డివిజన్‌లో జలమండలి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ రోజాదేవి పాల్గొని మాట్లాడుతూ... వేసవి కాలంలో నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం ప్రభాకర్, డీజీఎం వెంకటేశ్వరరావు, మేనేజర్ ప్రియాంక, రామచంద్రరావు, హిమగిరిరావు, శ్రీనివాసరెడ్డి, పురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాఘవులు, నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ నీటి దినోత్సవంలో పాల్గొన్న జలమండలి అధికారులు, కార్పొరేటర్ రోజాదేవి

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల ఉపాధ్యాయుల నిరసన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రతీ నెల ఒకటో తేదీన చెల్లించాల్సిన వేతనాలు 15వ తేదీ వరకు అందజేయక పోగా.. ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూడాల్సి వస్తోందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం కమిటీ జిల్లా ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన టీచర్లు నిరసన తెలపడంతో పాటు జిల్లా ట్రెజరీ అధికారి నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయుల సప్లిమెంటరీ వేతనాలు, పీఆర్సీ బకాయిలు, సెలవు వేతనాలు, పెన్షనరీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీఎస్‌జీఎల్‌ఐ, జీపీఎఫ్ క్లెయిములు తదితర బిల్లులన్నీ ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ, ఏడు నెలలుగా సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో నిధులు జమ కాలేదన్నారు. మరికొన్ని బిల్లులు సంవత్సరానికిపైగా పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకో వారం రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో వెంటనే బిల్లులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ టీచర్ల వేతనాలు, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని పోరాట కమిటీ డిమాండ్ చేస్తూ యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ నిరసనలో జిల్లా స్టీరింగ్ కమిటీ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు బ్రహ్మాచారి, తిరుపతి, రాకేష్, హరిచంద్, కవిధర్, కరుణాకర్, రేణుక, సుజాత, పురుషోత్తం, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.